# హజ్ మరియు ఉమ్రహ్ - 1

[ తెలుగు – Telugu – تلغو ]

షేఖ్ అబ్దుల్ అజీజ్ బిన్ బాజ్ (రహిమహుల్లాహ్)

అనువాదం : ముహమ్మద్ కరీముల్లాహ్

రివ్యూ : షేఖ్ నజీర్ అహ్మద్

2012 - 1433

IslamHouse.com

# الحج والعمرة - ١

« بلغة التلغو »

سماحة الشيخ عبد العزيز بن باز - رحمه الله

ترجمة: محمد كريم الله

مراجعة: شيخ نذير أحمد

2012 - 1433

IslamHouse.com

# హజ్ మరియు ఉమ్రహ్ తక్షణం పూర్తిచేయవలసిన విధులనటానికి ఋజువులు

సత్యాన్ని గ్రహించటానికి మరియు దానిని అనుసరించటానికి మీకూ మరియు మాకూ, అల్లాహ్ తగిన శక్తిసామర్థ్యాలను ప్రసాదించుగాక! తగిన స్తోమత కలిగిన తన దాసులు తక్షణం తన పవిత్ర కాబా గృహానికి హజ్ యాత్ర చేయటాన్ని అల్లాహ్ విధిగా చేసినాడు. తరచుగా హజ్ యాత్ర చేయటం ఉత్తమం. ఆయన దీనిని ఇస్లాం యొక్క ఐదు మూలస్థంభాలలోని ఒక మూలస్థంభంగా ఆజ్ఞాపించినాడు. అల్లాహ్ ప్రకటన:

"**అల్లాహ్ కు ప్రజలపై ఉన్న హక్కు ఏమిటంటే – ఎవరైతే దాని వైపు ప్రయాణించే శక్తీ, స్థోమత కలిగియుంటారో, వారు ఆ గృహయాత్ర (హజ్) తప్పక చేయాలి. ఎవరైతే దీనిని తిరస్కరిస్తారో, నిశ్చయంగా అల్లాహ్ సకల లోకవాసుల అవసరం ఏమాత్రమూ లేని నిరపేక్షాపరుడు (అని తెలుసుకోవాలి)**" ఖుర్ఆన్ 3:97

సహీహ్ అల్ బుఖారీ మరియు సహీహ్ అల్ ముస్లిం హదీథు సంకలనములలోని ఇబ్నె ఉమర్ రదియల్లాహు అన్హు ఉల్లేఖన : ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపారు:

“ఇస్లాం యొక్క పునాది ఈ ఐదింటిపై ఆధారపడి ఉన్నది. అవి:

1. ‘లాఇలాహ ఇల్లల్లాహ్ వ అన్న ముహమ్మదుర్రసూలుల్లాహ్’ అని సాక్ష్యమివ్వటం (అనగా అల్లాహ్ తప్ప వేరెవ్వరూ ఆరాధనకు అర్హులు కారు మరియు ముహమ్మద్ అల్లాహ్ యొక్క సందేశహరుడు అని అర్థం).
2. నమాజును స్థాపించుట.
3. జకాతును చెల్లించుట.
4. రమదాను నెల ఉపవాసాలు పాటించుట.
5. అల్లాహ్ యొక్క పవిత్ర కాబాగృహానికి హజ్జ్ యాత్ర చేయుట.”

ఉమర్ రదియల్లాహు అన్హు ఉల్లేఖన ఆధారంగా తన సునన్ లో సయీద్ ఇలా పేర్కొన్నారు:

“వాస్తవంగా, ఈ ప్రాంతాలకు నేను నా మనుషులను పంపి, తగిన స్తోమత కలిగి ఉన్నా ఇంత వరకు హజ్ చేయని ప్రజలను గుర్తించి, వారిపై జిజియా పన్ను (ముస్లింల రక్షణకు బదులుగా ముస్లిమేతరులు చెల్లించవలసిన పన్ను) విధించాలని అనుకున్నాను. అలాంటి వ్యక్తులు ముస్లింలు కారు; వారు ముస్లింలు కాజాలరు.”

అలీ రదియల్లాహు అన్హు ఉల్లేఖన:

తగిన స్తోమత కలిగి ఉండీ, ఎవరైతే హజ్ యాత్ర పూర్తి చేయరో, అలాంటి వ్యక్తి యూదుడిగా చనిపోయినా లేదా క్రైస్తవునిగా చనిపోయినా చింతించవలసిన అవసరం లేదు.

హజ్ పూర్తిచేయటంలో త్వరపడవలెను:

గడువు అయిపోయినా, ఇంత వరకు హజ్ యాత్ర పూర్తి చేయక పోతే, వెంటనే దానిని పూర్తి చేయటానికి త్వరపడవలెను. ఎందుకంటే (దానిని పూర్తి చేయటంలో) ఏది ఆటంకంగా మారుతుందో ఎవ్వరూ చెప్పలేరు.

అబ్దుల్లాహ్ ఇబ్నె అబ్బాస్ రదియల్లాహు అన్హుమా ఉల్లేఖన: ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు,

"హజ్ యాత్ర పూర్తి చేయటంలో త్వరపడండి. ఎందుకంటే (దానిని పూర్తి చేయటంలో) ఏది ఆటంకంగా మారుతుందో ఎవ్వరికీ తెలియదు." అహ్మద్ హదీథ్ గ్రంథం.

ఈ ఖుర్ఆన్ ఆదేశం ప్రకారం, స్తోమత కలిగిన వారెవరైనా సరే, గడువు కాగానే తక్షణం హజ్ యాత్రను పూర్తి చేయాలి.

**“అల్లాహ్ కు ప్రజలపై ఉన్న హక్కు ఏమిటంటే – ఎవరైతే దాని వైపు ప్రయాణించే శక్తీ, స్థోమత కలిగియుంటారో, వారు ఆ గృహయాత్ర (హజ్) తప్పక చేయాలి. ఎవరైతే దీనిని తిరస్కరిస్తారో, నిశ్చయంగా అల్లాహ్ సకల లోకవాసుల అవసరం ఏమాత్రమూ లేని నిరపేక్షాపరుడు (అని తెలుసుకోవాలి)”** ఖుర్ఆన్ 3:97

తన అంతిమ హజ్ ప్రసంగంలో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ప్రకటించారు:

“ఓ ప్రజలారా! హజ్ యాత్రను అల్లాహ్ మీపై విధిగా చేసినాడు. కాబట్టి మీరు దానిని తప్పకుండా పూర్తి చేయవలెను” ముస్లిం హదీథ్ గ్రంథం

ఉమ్రహ్ తప్పని సరి విధి అని తెలిపే అనేక హదీథులు ఉన్నాయి. వాటిలోని ఒక హదీథు ఏదంటే ఇస్లాం గురించి తెలుపమని జిబ్రయీలు అలైహిస్సలాం, ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను అడుగగా, దానికి ఆయన ఇలా జవాబిచ్చారు –

“ఇస్లాం అనగా: ‘లాఇలాహ ఇల్లల్లాహ్ వ అన్న ముహమ్మదుర్రసూలుల్లాహ్ (అల్లాహ్ తప్ప వేరెవ్వరూ ఆరాధనకు అర్హులు కారు మరియు ముహమ్మద్ అల్లాహ్ యొక్క సందేశహరుడు)’ అని సాక్ష్యమిచ్చుట, నమాజులు స్థాపించుట, జకాతు చెల్లించుట, హజ్

మరియు ఉమ్రహ్ చేయుట, (భార్యాభర్తల) సంభోగం తర్వాత గుసుల్ చేయుట (ఇస్లామీయ పద్ధతిలో స్నానం చేయుట), సంపూర్ణంగా వుదూ చేయుట మరియు రమదాన్ మాసంలో పూర్తిగా ఉపవాసాలు పాటించుట." ఇబ్నె ఖుజైమహ్ మరియు అద్దర్ఖుత్నీలు పేర్కొన్న ఉమర్ ఇబ్నె ఖత్తాబ్ రదియల్లాహు అన్హు ఉల్లేఖన. (అద్దర్ఖుత్నీ దీనిని ప్రామాణిక హదీథుగా వర్గీకరించారు)

అలాగే, మరో హదీథులో ఆయెషా రదియల్లాహు అన్హా ఇలా ఉల్లేఖించారు, ఆమె "ఓ రసూలుల్లాహ్! అల్లాహ్ మార్గంలో పోరాడవలసిన కర్తవ్యం మహిళలపై కూడా ఉందా?" అని ప్రశ్నించగా, ఆయన ఇలా జవాబిచ్చారు, "వారిపై ఎలాంటి పోరాటం లేని జిహాద్ కర్తవ్యం ఉంది – అదే హజ్ మరియు ఉమ్రహ్". (అహ్మద్ మరియు ఇబ్నె మాజహ్ హదీథు గ్రంథాలు)

## జీవితంలో కనీసం ఒకసారైనా హజ్ మరియు ఉమ్రహ్ పూర్తిచేయవలసిన కర్తవ్యం, బాధ్యత:

ఈ హదీథు సూచించిన విధంగా, హజ్ మరియు ఉమ్రహ్ లు జీవితంలో కనీసం ఒక్కసారైనా తప్పకుండా పూర్తి చేయవలసి ఉన్న విధులు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు,

“(జీవిత కాలంలో) కనీసం ఒక్కసారైనా హజ్ చేయటం తప్పని సరి విధి మరియు ఒకవేళ ఎవరైనా దీనిని ఒకసారి కంటే అధికంగా చేసినట్లయితే, అది అతని కొరకు నఫిల్ (ఐచ్ఛిక) హజ్ అవుతుంది.”

అయితే, అబూ హురైరహ్ రదియల్లాహు అన్హు ఉల్లేఖించిన ఈ హదీథు ప్రకారం తరచు హజ్ మరియు ఉమ్రహ్ లు చేయటం ఉత్తమం. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు,

“ఉమ్రహ్ తరువాత ఉమ్రహ్ చేయటమనేది వాటి మధ్య చేసిన పాపాలకు ప్రాయశ్చితంగా ఉపయోగపడుతుంది. మరియు హజ్ మబ్రూర్ (స్వీకరించబడిన హజ్) కు లభించే ప్రతిఫలం స్వర్గం తప్ప మరేదీ కాదు.”

## తమ పాపాల మరియు తప్పుల మన్నింపు కొరకు క్షమాభిక్ష వేడుకోవటం:

హజ్ లేదా ఉమ్రహ్ కొరకు ఒక ముస్లిం బయలుదేరుతున్నపుడు, అతను తన కుటుంబ సభ్యులను మరియు స్నేహితులను అల్లాహ్ కు భయపడమని బోధించవలెను.

అల్లాహ్ యొక్క దివ్యాజ్ఞలకు కట్టుబడి జీవించాలని మరియు నిషేధించబడిన వాటన్నింటికీ దూరంగా ఉండాలని ప్రోత్సహించవలెను.

తను అప్పు ఇచ్చిన లేదా అప్పు పుచ్చుకున్న ధనం మరియు వ్యక్తుల వివరాలు స్పష్టంగా వ్రాసి, దానికి కొందరిని సాక్షులుగా చేసుకోవలెను.

చేసిన పాపాలకు తప్పకుండా పశ్చాత్తాప పడుతూ, ప్రాయశ్చితం కొరకు వేడుకోవటం అతనికి అనివార్యం. దీని గురించిన ఖుర్ఆన్ ప్రకటన:

“ముస్లింలారా! మీరంతా కలసి అల్లాహ్ సన్నిధిలో పశ్చాత్తాపం చెందండి. తద్వారా మీరు సాఫల్యం పొందవచ్చు” ఖుర్ఆన్ ౨౪:౩౧

పాపకార్యాలకు దూరమవుతూ, వాటిని పూర్తిగా వదిలివేయటం, చేసిన పాపాలకు చింతించటం, భవిష్యత్తులో అలాంటి వాటిని మరల చేయకూడదని దృఢంగా నిశ్చయించుకోవటం మొదలైనవి పశ్చాత్తాపం చెందటంలోని చిత్తశుద్ధిని ప్రదర్శిస్తాయి.

ఇతరుల ఆస్తిపాస్తులు, పశుపక్ష్యాదులు మొదలైనవి ఏవైనా ఒకవేళ అతని దగ్గర ఉంటే, వాటిని అతను తన హజ్ ప్రయాణం ప్రారంభించటానికి ముందే వారికి వాపసు చేసివేయవలెను లేదా వారిని మన్నించమని అడిగి, అనుమతి తీసుకోవలెను.

దీని గురించి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా బోధించారు,

“ఎవరైతే తన సోదరుడికి ధనసంపదలు, ఆస్తిపాస్తులు లేదా మానమర్యాదలు బాకీ ఉంటే, దిర్హం లేక దీనార్ లు ఏవిధంగానూ

ఉపయోగపడని రోజు రాక ముందే, అంటే ఈరోజే అతను వాటిని తిరిగి చెల్లించివేయవలెను. ఒకవేళ అతని వద్ద పుణ్యాలేమైనా ఉంటే, వాటిలో నుండి అతను హక్కు లాక్కున్న వారి (అతని దౌర్జన్యానికి గురైనవారికి) హక్కుకు సమానమైన పుణ్యాలు వారి లెక్కలోనికి బదిలీ చేయబడతాయి. ఒకవేళ అతని వద్ద పుణ్యాలేమీ లేకపోతే, వారి పాపాలు అతని లెక్కలోనికి బదిలీ చేయబడతాయి."

**హజ్ ఖర్చుల కొరకు వెచ్చించే ధనం న్యాయంగా సంపాదించినదై ఉండాలి:**

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క ఈ ఆదేశాన్ని అనుసరిస్తూ, న్యాయంగా సంపాదించిన ధనంలో నుండి మాత్రమే హజ్ మరియు ఉమ్రహ్ ల కొరకు ఖర్చు చేయాలి.

"అల్లాహ్ పరిశుద్ధుడు మరియు ఆయన కేవలం పరిశుద్ధమైన వాటినే స్వీకరిస్తాడు"

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పలుకులను అబూ హురైరహ్ రదియల్లాహు అన్హు ఉల్లేఖన ఆధారంగా అత్రబరానీ ఇలా పేర్కొన్నారు:

"ఎప్పుడైతే ఒక వ్యక్తి న్యాయబద్ధమైన సంపాదనతో హజ్ కొరకు బయలు దేరి, 'లబ్బైక్ (హాజరయ్యాను, ఓ నా ప్రభూ! హాజరయ్యాను) ' అని ఉచ్ఛరిస్తూ, తన వాహనంపై ఎక్కటానికి అడుగు ముందుకు వేస్తాడో, అపుడు స్వర్గంలో నుండి పలికేవారు ఇలా అంటారు 'నీ

పిలుపుకు సమాధానం ఇవ్వబడుగాక మరియు ప్రతిఫలంగా నీకు సంతోషము ప్రసాదించబడుగాక! నీ ప్రయాణ సామగ్రి మరియు వాహనం న్యాయబద్ధమైనవి మరియు నీ హజ్ స్వీకరించబడుతుంది మరియు పాపాల నుండి నీవు విముక్తుడవుతావు. దీనికి విరుద్ధంగా, ఎప్పుడైతే ఒక వ్యక్తి అన్యాయంగా సంపాదించిన ధనంతో హజ్ కొరకు బయలుదేరి, 'లబ్బైక్ (హాజరయ్యాను, ఓ నా ప్రభూ! హాజరయ్యాను) ' అని ఉచ్ఛరిస్తూ, తన వాహనంపై ఎక్కటానికి అడుగు ముందుకు వేస్తాడో, అపుడు స్వర్గంలో నుండి పలికేవారు ఇలా పలుకుతారు 'నీ పిలుపుకు సమాధానం ఇవ్వబడకుండా ఉండుగాక మరియు ప్రతిఫలంగా నీకు సంతోషము ప్రసాదించబడకుండా ఉండుగాక! నీ ప్రయాణ సామగ్రి మరియు వాహనం న్యాయబద్ధమైనవి కావు మరియు నీ హజ్ స్వీకరించబడదు."

## హజ్ యాత్రికుడు ఇతరుల సంపాదన వాడకూడదు మరియు ఇతరుల నుండి ఆర్థిక సహాయం కోరకూడదు:

దీని గురించి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు,-

"(ఇతరులను యాచించటం నుండి) ఎవరైతే తనను తాను కాపాడుకుంటాడో, అల్లాహ్ అతనిని (అలా యాచించే పరిస్థితి నుండి)

కాపాడుతాడు. మరియు ఎవరైతే ఇతరుల బాధ్యతలలో పాలుపంచుకుంటాడో, అల్లాహ్ అతనిని ధనవంతుడిని చేస్తాడు.”

మరో హదీథులో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా పేర్కొన్నారు,

“ఎవరైతే ఎల్లప్పుడూ ఇతరులను యాచిస్తూ ఉంటాడో, అంతిమ దినం నాడు అతను తన ముఖంపై ఒక్క మాంసపు కండ కూడా లేకుండా కనబడతాడు.”

## హజ్ యొక్క ఉద్దేశం – అల్లాహ్ యొక్క ఇష్టము, ప్రీతి, సంతృప్తి, సంతుష్టి కొరకు ప్రయత్నించుట:

హజ్ యాత్రికుడు తన హజ్ మరియు ఉమ్రహ్ ద్వారా అల్లాహ్ యొక్క సంతృప్తి, పరలోక సాఫల్యం మరియు సుఖం పొందటానికి పూర్తిగా శ్రమించవలెను. ఈ పవిత్ర ప్రాంతాల్లో ఉన్నప్పుడు, అల్లాహ్ ఇష్టపడే పలుకుల మరియు ఆచరణల ద్వారా అతడు అల్లాహ్ కు చేరువ కావటానికి ప్రయత్నించవలెను.

హజ్ యాత్ర నుండి ఎలాంటి ప్రాపంచిక ప్రయోజనాల్నీ ఆశించకుండా ఉండటానికి తన శాయశక్తులా ప్రయత్నించవలెను. అలాగే హజ్ యాత్రికునిలో కపటత్వపు దురుద్దేశం, పేరుప్రఖ్యాతులు మరియు కీర్తిప్రతిష్ఠలు సంపాదించాలనే దురాశ ఉండకూడదు – ఎందుకంటే

ఇలాంటి లక్షణాలు దుష్ట లక్షణాలు. ఇవి అతని హజ్ ఆచరణలను వ్యర్థం చేస్తాయి. తత్ఫలితంగా అతని హజ్ మరియు మంచి ఆచరణలు తిరస్కరించబడతాయి. అల్లాహ్ ఇలా ప్రకటించినాడు,

"ఎవరయితే ప్రాపంచిక జీవితం పట్ల, దాని అందచందాల పట్ల వ్యామోహితులవుతున్నారో అలాంటి వారికి వారి కర్మలను (వాటి ఫలితాన్ని) మేము ఇక్కడే పూర్తిగా ఇచ్చేస్తాము. ఇక్కడ (ప్రపంచంలో) వారికి ఏ లోటూ జరగదు. అయితే అలాంటి వారికి పరలోకంలో అగ్ని తప్ప మరేమీ లభించదు. ప్రపంచంలో వారు చేసుకున్నదంతా వృథా అయిపోతుంది. వారు చేసే పనులన్నీ మిథ్యగా మారిపోతాయి." ఖుర్ఆన్ ౧౧:౧౫-౧౬

అలాగే ఖుర్ఆన్ లో మరోచోట అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు,
"ఎవడు తొందరగా లభించే ప్రాపంచిక లాభాలను కోరుకుంటాడో అతనికి మేము ఇహంలో తొందరగానే – మేము తలచిన వానికి తలచినంతగా – ఇస్తాము. ఎట్టకేలకు అతని కోసం మేము నరకాన్ని నియమిస్తాము. అందులోకి వాడు అత్యంత నికృష్ట స్థితిలో, కారుణ్యానికి దూరమైన వాడై ప్రవేశిస్తాడు. మరెవరయితే పరలోకాన్ని కోరుకుని, దానికోసం కృషి చేయవలసిన విధంగా కృషి చేస్తాడో, విశ్వాసి అయి ఉంటాడో అలాంటి వాని కృషి అల్లాహ్ వద్ద ఆదరణ పొందుతుంది." ఖుర్ఆన్ ౧౭ :౧౮-౧౯

ఒక ప్రామాణిక హదీథులో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ప్రకటించారు,

"అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు, 'నాకు సాటి కల్పించబడిన భాగస్వాములను వారి స్థానాల నుండి తొలగించటానికి నేనే చాలును. ఎవరైతే ఏదైనా ఆచరణలో ఇతరులను నాకు భాగస్వాములుగా చేస్తారో, నేను అతనిని మరియు అతడు జతచేసిన భాగస్వామ్యాన్ని నేను స్వీకరించను' "

హజ్ యాత్రికుడు దృఢమైన, స్థిరమైన జ్ఞానం మరియు ఈమాన్ (విశ్వాసం) కలిగి ఉన్న సజ్జనులు మరియు అల్లాహ్ అంటే భయభక్తులు గలవారి సాహచర్యంలో ఉండటానికి ప్రయత్నించవలెను. అజ్ఞానుల మరియు పాపిష్టుల సాహచర్యం నుండి దూరంగా ఉండవలెను.

అంతేగాక యాత్రికుడు హజ్ మరియు ఉమ్రహ్ ల గురించిన నియమ నిబంధనలన్నింటినీ నేర్చుకోవలెను మరియు ముఖ్యాంశాలన్నింటినీ జ్ఞాపకం ఉంచుకోవలెను. ఎప్పుడైనా సందేహం కలిగితే, అసలు విషయాన్ని తెలుసు కొనుట కొరకు తనకు తెలియని దాన్ని అందుబాటులోని జ్ఞానవంతులను అడిగి తెలుసుకోవలెను.

అతడు కారు, విమానం, వాహనం మొదలైన ప్రయాణ మాధ్యమాలపై అడుగు పెట్టినప్పుడు, బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం (అనంత

**కరుణామయుడైన, అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో) అని పలికి, అల్లాహ్ ఘనతను కొనియాడుతూ మరియు స్తుతిస్తూ, 'అల్లాహు అక్బర్ (అల్లాహ్ అందరికన్నా గొప్పవాడు)' అని మూడు సార్లు పలకవలెను.**

**ఆ తరువాత క్రింది దుఆ చదవ వలెను,**

*సుబ్ హానల్లదీ సఖ్ఖర లనా హాదా వమా కున్నా లహూ ముఖ్రినీన్*

దూరాన్ని త్వరగా ఛేదించు. ఓ అల్లాహ్! ఈ ప్రయాణంలో నీవే నాకు తోడు. నా కుటుంబానికి నీవే సంరక్షకుడివి, ప్రయాణపు శ్రమా ఇబ్బందుల నుండీ, చెడూ బాధాకర దృశ్యాల నుండీ అలాగే నా ఇంటివారిలోనూ, నా సంపదలోనూ నష్టం వాటిల్లే స్థితిలో నుండి తిరిగి రావటం నుండి ఓ అల్లాహ్! నీ శరణు వేడుకుంటున్నాను.

ప్రామాణిక వ్రాతలలో మరియు ముస్లిం గ్రంథంలోని అబ్దుల్లాహ్ ఇబ్నె ఉమర్ రదియల్లాహు అన్హుమా ఉల్లేఖనలో పేర్కొనబడిన ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సున్నతుల నుండిఈ దుఆ వేడుకునే విధానం గ్రహించబడింది. మొత్తం ప్రయాణ సమయంలో అల్లాహ్ యొక్క దికర్ (ధ్యానం) చేయవలెను, ఆయన క్షమాభిక్షను వేడుకోవలెను, ఆయన భయంతో ఏడవవలెను, ఖుర్ఆన్ పఠించవలెను, దాని ఆయతులను వీలయినంత వరకు అర్థం చేసుకోవటానికి ప్రయత్నించవలెను. నిరంతరంగా తప్పని సరి నమాజులను సామూహికంగా చేయవలెను. దీనిలో ఎలాంటి కొరతా చేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవలెను. అనవసరమైన సంభాషణల, వాదోపవాదాల జోలికి పోకూడదు. హాస్యం మరియు పరిహాసం మితిమీరకూడదు. అబద్ధాలాడటం, చాడీలు చెప్పటం, నిందలు మోపటం, స్నేహితులను మరియు తోటి ముస్లింలను ఎగతాళి చేయటం నుండి దూరంగా ఉండవలెను. వీటికి బదులు, తన సహచరుల పట్ల మంచిగా, ఉత్తమంగా ప్రవర్తించవలెను. వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను

తొలగించటంలో వారికి సహాయపడవలెను. వివేకంతో మరియు చిత్తశుద్ధితో వారికి మంచిని బోధించవలెను మరియు చెడు నుండి నివారించవలెను.